క్లుప్తంగా

నిరంతర సాధన.. ప్రగతికి సోపానం



విజయవాడ కల్చరల్: నిరంతర సాధన ప్రగతికి సోపానమని సీనియర్ గాయకుడు ప్రిన్స్ అన్నారు. రాగాల పల్లకీ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో సోమవారం సినీ సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్స్ మాట్లాడుతూ గాయకులు రచయిత భావాన్ని, సంగీత దర్శకుని ఆత్మను పట్టుకొని పాటలు పాడాలని సూచించారు. నిర్వాహకుడు రామకృష్ణ మాట్లాడుతూ గాయకుడు ప్రిన్స్ అనేక సంగీత విభావరి కార్యక్రమాలకు సంగీత దర్శకత్వం వహించినట్లు తెలిపారు. అనేక మంది గాయనీ గాయకులను తయారు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకురాలు కృష్ణవేణి ప్రిన్స్‌ను ఆత్మీయంగా సత్కరించారు.

15న అఖండ కచ్ఛపీ మహోత్సవం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతీ సంగీత సమితి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేది శనివారం ఉదయం అఖండ కచ్ఛపీ మహోత్సవం(నిర్విరామ వీణా వాద్య కచేరీ) నిర్వహించనున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి సీవీ రావ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో సద్గురు త్యాగరాజస్వామి రచించిన పంచరత్న కృతుల గోష్ఠిగానంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు వీణపై పలు త్యాగరాజస్వామి కృతులను గానం చేస్తారని పేర్కొన్నారు. ఏపీ జెన్‌కో ఎండీ కేవీఎస్ చక్రధర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

ముగిసిన శ్రీదత్తసాయి మందిర వార్షికోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిర వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. బాబావారికి మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పారాయణం జరిగింది. పారాయణం, భజన చేసిన భక్తబృందం సభ్యులను బాబావారి శేషవస్త్రం, చిత్రపటంతో సత్కరించారు. రాత్రి శేజ్‌హారతితో వార్షికోత్సవాలు ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు బాబావారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

16న శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు

విజయవాడ కల్చరల్: శ్రీకృష్ణదేవరాయ విగ్రహ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో కృష్ణదేవరాయలు 554వ జయంతి ఉత్సవాలను భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహించనున్నట్లు సోమవారం దేవరాయలు విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో విగ్రహ కమిటీ చైర్మన్ శీలం నాగేశ్వరరావు వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ సంస్థ ద్వారా విగ్రహం వద్ద ప్రతి శనివారం పేదలకు అన్నదానం, 24 గంటలపాటు చలివేంద్రం, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జయంతి సందర్భంగా సంగీత కళాశాలలో నిర్వహించే సభలో రాజకీయ ప్రముఖులతోపాటు, సాహిత్య రంగానికి చెందిన 50 కవులు, రచయితలు పాల్గొంటారని వారికి సత్కారం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉత్సవాలకు శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్నట్లు పేర్కొన్నారు.

నేత్ర పర్వంగా సాగిన కూచిపూడి నృత్యాలు



విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని పంచమవేద సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ, అభినయ నృత్య నిలయం ఆధ్వర్యాన సోమవారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి. నాట్యాచారిణి కృష్ణ గౌతమి మాట్లాడుతూ సంప్రదాయ నృత్యాలను పరిరక్షించుకోవాలని పేర్కొన్నారు. చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించి గురువులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. నాట్యాచారిణి లంకా మహాలక్ష్మి భువనేశ్వరి మాట్లాడుతూ గురు సంప్రదాయాన్ని పరిరక్షించుకోవాలని చెప్పారు. మూషిక వాహన, వినాయక కౌతం, బొమ్మ బొమ్మగా, నారాయణతే నమో నమో, జతి సర్వం అంబే అంబికే గరుడ గమన అంశాలకు చిన్నారులు హిమజ, యశశ్రీ విద్య, వైష్ణవి, శర్వాణి, శివానీ, శివనయన నృత్యాలు అభినయించారు. నిర్వాహకులు చిన్నారులను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో సురేష్, భాస్కర శర్మ పాల్గొన్నారు.

మీటర్‌కో రేటు.. స్తంభానికో రేటు

- సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అవినీతి కంపు
- వినియోగదారులకు చుక్కలు చూపుతున్న వైనం



సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):

వినియోగదారుడు: సార్.. మేము కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నాం.. మా ఇంటికి కరెంట్ మీటర్ వేయాలి.

ట్రాన్స్‌కో సిబ్బంది: అవునా ఎన్ని మీటర్లు కావాలి.. చలానాలు కాకుండా మీటర్‌కు రూ. 10 వేలు అదనంగా ఇవ్వాలి.

మరో వినియోగదారుడు: మా ప్రాంతంలో వీధిలైట్లు లేవు.. కొంచెం స్తంభాలు వేయాలి.

ట్రాన్స్‌కో సిబ్బంది: అవునా.. పది స్తంభాలు పడతాయి.. చలానాలు కాకుండా స్తంభానికి రూ. 25 వేలు చొప్పున అవుతుంది.

అవునా.. అని కొంతమంది వినియోగదారులు బాబ్బాబూ.. మేము అంత ఇచ్చుకో లేము.. కాస్త తగ్గిస్తారా.. అని వేడుకుంటున్న వినియోగదారులకు వారు చెప్పే సమాధానం ఒక్కటే మా దగ్గర బేరాలు లేవమ్మా అని.. మరికొంతమంది వినియోగదారులు వారు అడిగిన డబ్బులు విని ముందే షాక్‌కు గురవుతున్నారు. అసలు మేము ఎందుకు ఇవ్వాలి.. అంత ఇవ్వం.. ఇంతే ఇస్తామని చెప్పారా.. ఇక వారి పని అంతే. రోజులైనా.. వారాలైనా.. అక్కడ మ్యాటర్ క్లియర్ చేయకపోతే.. ఇక్కడ వీరికి 'మీటర్' రానట్టే లెక్క. ఇదీ అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో యథేచ్ఛగా సాగుతున్న అవినీతి దందా.

ఇవిగో పలు సంఘటనలు

- స్థానిక 58వ డివిజన్ నందమూరినగర్, తోటవారి వీధి ప్రాంతాల్లో నూతనంగా బిల్డర్లు నిర్మిస్తున్న ఇళ్లకు కొత్తగా మీటర్లు వేసేందుకు మీటర్‌కు రూ. 10 వేల చొప్పున డబ్బులు వసూళ్లు చేసినట్లు తెలిసింది.
- ఇందిరానాయక్‌నగర్ అయ్యప్పస్వామి టెంపుల్ సమీపంలో నిర్మిస్తున్న ఓ గ్రూప్ హౌస్‌కు మూడు మీటర్లు వేసేందుకు మీటర్‌కు రూ. 25 వేల చొప్పున రూ.75 వేలు తీసుకున్నట్లు సమాచారం.
- స్థానిక 57వ డివిజన్ న్యూఆర్ఆర్‌పేటలోని అపార్ట్‌మెంట్స్ వెనుక భాగంలో 10 విద్యుత్ స్తంభాలు వేసేందుకు ఓ యజమాని నుంచి రూ. 2 లక్షలు.. మరో యజమాని నుంచి రూ. 2.50 లక్షలు వసూళ్లు చేసినట్లు తెలుస్తుంది.
- నందమూరినగర్, తోటవారివీధి, భరతమాత మందిరం రోడ్లలోని పలు గ్రూప్ హౌస్, అపార్ట్‌మెంట్ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు వేయడానికి రూ. 2 నుంచి 4 లక్షల వరకూ అదనంగా డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.

ఇలా సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అవినీతి బాగా పెరిగిపోతుందని.. తాము ఏ పనికి వెళ్లినా.. చలానాలకు కాకుండా అదనంగా డబ్బులు లంచాలు ఇవ్వాల్సి వస్తోందని వినియోగదారులు కలత చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఈ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న అవినీతి దందాపై సమగ్ర విచారణ జరిపి.. వాస్తవాలను గ్రహించి.. వినియోగదారులను దోచుకుంటున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఏ పనికైనా.. అడిగినంతా ఇవ్వాల్సిందే..

సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వినియోగదారులు ఏ పని చేయించుకోవాలన్నా ఇక్కడి అధికారులు, సిబ్బంది అడిగినంత ముట్టచెబితేనే పనులు జరుగుతాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ సబ్‌స్టేషన్ పరిధిలో సింగ్‌నగర్, నందమూరినగర్, ఆంధ్రప్రభకాలనీ, తోటవారి వీధి, ఇందిరానాయక్‌నగర్, భారత మాత మందిరం రోడ్డు, సన్‌సిటీ కాలనీ, న్యూరాజరాజేశ్వరీపేట పరిసర ప్రాంతాలు ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు కావడంతో ఇక్కడ నూతన భవన నిర్మాణాలు, గ్రూప్ హౌస్‌లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు అధికంగా జరుగుతుంటాయి. అయితే వీటినే అదునుగా చేసుకొని ట్రాన్స్‌కో సిబ్బంది అవినీతి దందాకు తెరలేపారు. మీటర్ కావాలన్నా.. స్తంభం వేయాలన్నా.. చివరకు విద్యుత్ బిల్లు కట్టలేదని ఫ్యూజు తీసుకువెళితే అది తిరిగి ఇచ్చేందుకు కూడా డబ్బులు ఇవ్వాల్సిన దుస్థితి నెలకొందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలాంటి వాటిని ఉపేక్షించం

మీటర్లు.. విద్యుత్ స్తంభాల వంటి ఏర్పాటుకు అంతా ఆన్‌లైన్‌లోనే చలానాలు కట్టాల్సి ఉంటుంది. అలా చలానాలకు మించి అదనంగా ఏ ఒక్కరికి డబ్బులు ఇవ్వాల్సిన పనిలేదు. వినియోగదారుల నుంచి ఎక్కువ డబ్బులు తీసుకోవడం చట్టరీత్యా నేరం. అటువంటి వాటిని ఉపేక్షించబోం. అలా ఎవరైనా తమ అధికారులు, సిబ్బంది నుంచి ఏవైనా సమస్యలు ఎదురైతే 94408 12084 అనే ఫోన్ నెంబర్ ద్వారా నా దృష్టికి కానీ, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి కానీ తీసుకువస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. –రవీంద్రబాబు, డీఈఈ, విజయవాడ టౌన్, ట్రాన్స్‌కో

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్‌పై విస్తృత చర్యలు చేపట్టాలి

అధికారులకు నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై విస్తృతమైన చర్యలు చేపట్టాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ శాఖాధిపతులతో సోమవారం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో మూడు సర్కిళ్ల పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాన్‌పై విస్తృతమైన అవగాహన కల్పించాలని, దానికనుగుణంగా వినియోగదారులను గుర్తించి వారితో ఒక సమావేశం నిర్వహించాలన్నారు. విజయవాడ నగరంలో 120 మైక్రోన్స్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ వాడకాన్ని వీఎంసీ పూర్తిగా నిషేధించిందని, ఈ విషయాన్ని మరోమారు వినియోగదారులకు, వ్యాపారస్తులకు గుర్తుచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, సూపరింటెండెంట్ ఇంజినీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, పట్టణ సాధికార విభాగం(యూసీడీ) ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకటనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సీడీవోలు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడంలో కూటమి సర్కార్ విఫలం

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చిట్టచివరి గృహం వరకు కృష్ణా జలాలు అందించడమే లక్ష్యంగా కృషి చేయడం జరిగిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలల కాలంలో నియోజకవర్గంలో కొత్తగా ఏ ఒక్క అభివృద్ధి పని చేపట్టకపోగా.. గత ప్రభుత్వం ప్రారంభించిన పనులను సైతం కక్షపూరితంగా నిలిపివేయడం బాధాకరమన్నారు. దీంతో ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. 58వ డివిజన్ పరిధి వై.వి.ఎస్టేట్‌లో నిలిచిపోయిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వై.వి.ఎస్టేట్ నుంచి ఇందిరా నాయక్ నగర్ వరకు పరిసర ప్రాంతాల ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూనుకోగా.. ఫిబ్రవరి 9, 2023న భూమిపూజ చేసుకున్నట్లు గుర్తుచేశారు. రూ. 4.16 కోట్లతో 1,500కేఎల్ రిజర్వాయర్ నిర్మాణానికి మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ స్థానిక ప్రజలతో కలిసి ఆనాడు శంకుస్థాపన చేసుకోగా పనులు చివరి దశలో ఉన్నట్లు చెప్పారు. అలాగే రూ.3.61 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో నీటి సరఫరా పంపింగ్ మెయిన్ లైన్ పనులు కూడా అప్పటికే పూర్తి చేసుకోవడం జరిగిందని చెప్పారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కడ వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందోనని పనులు నిలిపివేసిందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ హయాంలో దావు బుచ్చయ్య కాలనీలో రూ. 3.30 కోట్ల అంచనాలతో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించడంతో పాటు గంగిరెద్దుల దిబ్బ నుంచి జీవీఆర్ నగర్ వాటర్ ట్యాంక్ వరకు రూ. 3.29 కోట్లతో 400ఎంఎం మంచి నీటి సరఫరా పంపింగ్ మెయిన్ పనులు పూర్తి చేసుకున్నట్లు చెప్పుకొచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం ఓవర్ హెడ్ ట్యాంక్‌ని వినియోగంలోకి తీసుకొచ్చే దిశగా ఆలోచన చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.

ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో శాతవాహన పరుగులు



ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడుస్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల భద్రత, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా ట్రాక్‌లు, కోచ్‌ల ఆధునికీకరణ దిశగా రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. గతంలో ఉండే ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో అత్యాధునిక ఎల్‌హెచ్‌బీ (లింక్ హాఫ్‌మన్ బుష్) కోచ్‌లను ప్రవేశపెట్టింది. అందులో భాగంగానే ఇప్పటివరకు విజయవాడ – సికింద్రాబాద్ మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్ (12713/12714) రైలును ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో అప్‌గ్రేడ్ చేసింది. ఈ కోచ్‌లలో ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేలా ఇంటీరియల్, కుషనింగ్ సీట్లు, కుదుపులు లేకుండా ఎయిర్ సస్పెన్షన్ సిస్టం, విశాలమైన కిటికీలను ఏర్పాటు చేసింది. పెరుగుతున్న రైళ్ల వేగాన్ని తట్టుకుని సున్నితమైన ప్రయాణ అనుభూతి కల్పించేలా సాంకేతిక పరిజ్ఞానం ఈ కోచ్‌లలో ఉన్నాయి. యాంటి క్లైంబింగ్, క్రాష్ వర్తినెస్ టెక్నాలజీతో పట్టాలు తప్పే ప్రమాదాలను నివారించేలా ఈ కోచ్‌లను అధునాతన భద్రత ప్రమాణాలతో రూపొందించారు. ఈ కోచ్‌లోని హాట్ బఫే కారు పూర్తిగా ఎయిర్ కండిషనింగ్, ఇండక్షన్ ఫ్లేమ్ కుకింగ్ ఇన్‌స్టాల్ చేశారు. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఆటోమెటిక్ ఫైర్ డిటెక్షన్, సప్రెషన్ సిస్టంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ శాతవాహన ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు అందుబాటులో రావటంతో ప్రయాణికులు సురక్షితంగా, సౌకర్యవంతంగా ఆనందకర ప్రయాణ అనుభూతిని పొందుతారని తెలిపారు. రానున్న రోజుల్లో రైలు ప్రయాణికులకు భద్రత, సౌకర్యాలపై నిరంతర కొత్త టెక్నాలజీలతో అప్‌గ్రేడ్ దిశగా రైల్వే సేవలు కొనసాగనున్నట్లు వివరించారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుణదల తిరునాళ్లకు స్నేహితులతో కలిసి వెళ్లిన తమపై దాడి చేశారంటూ ఫిర్యాదు చేయడంతో సోమవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భానూనగర్‌కు చెందిన వంజరపు పవన్ (16) ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు బుడమేరు మధ్యకట్ట నుంచి స్నేహితులతో కలిసి గుణదల తిరునాళ్లకు బయలుదేరారు. మార్గమధ్యలో రాంగోపాల్ థియేటర్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి ఎవరో అకారణంగా కొట్టారు. దీంతో మమ్మల్ని ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించగా నీకెందుకురా, నీకు చెప్పాలా అని చెప్పి, కోపంతో తన దగ్గర ఉన్న పదునైన ఆయుధంతో పవన్ మెడ మీద కోశారు. దీంతో గాయపడిన పవన్‌ను స్నేహితులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు నులిపురుగుల నిర్మూలన టాబ్లెట్ వాడాలి



విద్యార్థినికి ఆల్బెండజోల్ టాబ్లెట్ వేస్తున్న డాక్టర్ రాథోడ్

పాయకాపురం(విజయవాడరూరల్): విద్యార్థులందరూ తప్పనిసరిగా నులిపురుగుల నిర్మూలన టాబ్లెట్లు వాడాలని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వి.రాథోడ్ సూచించారు. రాజీవ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని విద్యార్థులకు టాబ్లెట్స్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగులు కడుపులో ఉన్న విద్యార్థులు నీరసంగా ఉండటం, రక్తహీనతతో బాధపడటం, జ్ఞాపకశక్తి తగ్గడం, సరిగా ఆహారం తీసుకోకపోవడం చేస్తుంటారని అన్నారు. ఇలాంటి ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి నులిపురుగుల నిర్మూలన టాబ్లెట్స్‌ను ఆరు నెలల నుంచి 19 ఏళ్ల వయస్సు విద్యార్థులు వేసుకోవాలని చెప్పారు. అనంతరం వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పిల్లలకు నులిపురుగుల నిర్మూలన టాబ్లెట్స్‌ను వేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం ప్రమీలారాణి, హెల్త్ విజిటర్ ఎ.సునీత, ఏఎన్ఎమ్ దుర్గాభవానీ పాల్గొన్నారు. అలాగే సమీపంలోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన టాబ్లెట్స్ వేశారు. ఎల్‌బీఎస్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మైనం హుస్సేన్ విద్యార్థులకు నులిపురుగల నిర్మూలన టాబ్లెట్స్‌ను పంపిణీ చేశారు. ఎలిమెంటరీ స్కూల్, కండ్రికలో టీవీ సుబ్బారెడ్డి హైస్కూల్, ఎలిమెంటరీ స్కూల్స్‌లోని విద్యార్థులకు అల్బెండజోల్ టాబ్లెట్స్‌ను పంపిణీ చేశారు.

కమనీయం శ్రీవారి కల్యాణోత్సవం

నేత్రపర్వంగా గజవాహనోత్సవం



కల్యాణోత్సవానికి హాజరైన ఉభయదాతలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి కల్యాణోత్సవం సోమవారం రాత్రి కమనీయంగా జరిగింది. స్వామి వారి సన్నిధిలో ఈ నెల ఏడు నుంచి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, సంకీర్తనలు, భక్తుల హరినామస్మరణలు, పండితుల వ్యాఖ్యానాల మధ్య స్వామివారు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను వివాహమాడిన దృశ్యాన్ని చూసి భక్తులు పులకించారు. ఆలయ ప్రాంగణంలో చూడముచ్చటగా ఏర్పాటు చేసిన కళావేదికపై ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి ఆలయ ప్రధానార్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణ, మహాసంకల్పం తదితర కార్యక్రమాలతో ఉత్సవమూర్తులను కల్యాణోత్సవానికి సిద్ధం చేశారు. అనంతరం జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు సమర్పణ తదితర ఘట్టాలను ఒకదాని తరువాత ఒకటిగా ప్రముఖ ఆగమ పండితుల పర్యవేక్షణలో ప్రధానార్చకుడు శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు. వివిధ మహిళా బృందాలు కీర్తనలను హృద్యంగా ఆలపించారు. ఈ కల్యాణోత్సవంలో పలువురు దంపతులు ఉభయదాతలుగా పాల్గొని ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా పారమాత్మిక హోమం

ఆలయ ప్రాంగణంలో ఉదయం స్వామివారి పారమాత్మిక హోమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పండితుల ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు భక్తులతో హోమాన్ని నిర్వహింపజేశారు. అనంతరం లక్ష గులాబీల అర్చనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో ఉభయదాతలు ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ గుడిపాటి పాపారావు నిర్వహించారు.

కరుణామూర్తి ఒడి.. భక్తజన సవ్వడి





విశ్వాస శిఖరం భక్తులతో పోటెత్తింది. కొండ దిగువ నుంచి ఎగువన కొండ గుహలోని లూర్ధుమాత విగ్రహం వరకూ.. ఆ పైన సిలువ వరకూ కిక్కిరిసింది. విశ్వాసుల ప్రార్థనలు, మొక్కుబడులు, దీపారాధనలు.. గురువుల సమష్టి దివ్యబలిపూజలు, దివ్య సత్ప్రసాదాలతో కొండంతా భక్తిభావం ప్రసరించింది. మేరీమాత తిరునాళ్లలో రెండో రోజు సోమవారం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మా వందనం.. మరియమ్మా వందనం.. మా కోసం నీ ప్రియసుతుని వేడమ్మా అంటూ భక్తులు ప్రార్థించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఐఓటీతో విస్తృత ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఐఓటీతో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని డాక్టర్ సర్దార్ పటేల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అకడమిక్స్ అండ్ రీసెర్చ్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం 'ఐఓటీ టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్' అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాల తరగతి గదులలోని స్మార్ట్ బ్లాక్‌బోర్డుల నుంచి పార్కిన్సన్స్ వ్యాధి సంకేతాలను గుర్తించగల వైద్య పరికరాల వరకు ఐఓటీ అనుసంధాన వ్యవస్థ అవసరమవుతోందన్నారు. ఐఓటీ ద్వారా ప్రపంచం అత్యంత వేగంగా మారుతోందన్నారు. మార్కెట్ అంచనాల ప్రకారం 2025 చివరికి మనదేశంలో ఐఓటీ వినియోగం 22 శాతం పెరిగి, 27 బిలియన్ పరికాలకు ఈ టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందన్నారు. సెన్సార్లను డివైజ్‌లతో అనుసంధానం చేయడం, వివిధ సెన్సార్ల క్రియాశీలత, క్లౌడ్ ప్లాట్‌ఫాం సాఫ్ట్‌వేర్ వినియోగించే విధానం గురించి శ్రీనివాసరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రసంగించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ టెక్నాలజీ పరంగా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను విద్యార్థులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. మార్కెట్ అంచనాలకు అనుగుణంగా తమ విద్యార్థులను తీర్చిదిద్దటానికి వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హిందూ హైస్కూల్స్ కమిటీ ఏవో డాక్టర్ వి. నారాయణరావు, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఆర్.ఉదయ్ కుమార్, అధ్యాపకురాలు బి.శృతి పాల్గొన్నారు.

నగరంలో సినీనటి నిధి అగర్వాల్ సందడి



సత్యనారాయణపురం (విజయవాడసెంట్రల్): సినీ నటి నిధి అగర్వాల్ సోమవారం సత్యనారాయణపురంలో సందడి చేశారు. ఎన్ఆర్‌పీ రోడ్డులోని ఓ జ్యూయలరీ షోరూమ్ ప్రారంభోత్సవానికి ఆమె విచ్చేశారు. అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని ఆమెతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. ఈ సందర్భంగా అభిమానులతో కొద్ది సేపు ఆమె మాట్లాడారు. విజయవాడ నగరం అంటే తనకెంతో ఇష్టమని అన్నారు. పవన్ కళ్యాన్‌తో హరిహర వీరమల్లు, రెబల్ స్టార్ ప్రభాస్‌తో రాజా సాబ్ చిత్రాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నానని చెప్పారు. ఇద్దరు మల్టీస్టారర్స్ చిత్రాల్లో నటించడం తనకెంతో సంతోషంగా ఉందని, ఈ రెండు చిత్రాలు విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు.